

దాడులు చట్ట వ్యతిరేకం

భౌతిక దాడులకు పాల్పడుతూ సభలను అడ్డుకోవడం చట్ట వ్యతిరేకమైన చర్య అని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. 8లో▸



నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యసేవలు అందించాలని లేదంటే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ అన్నారు. 8లో▸



క్రీడా పోటీలు నిర్వహిస్తాం

పీఆర్ఆర్ మినీ స్టేడియంలో జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు కృషిచేస్తామని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఉప్పల్ ఎమ్మెల్యేకు త్రుటిలో తప్పిన ప్రమాదం



స్వల్ప గాయాలతో సుభాష్‌రెడ్డి

కీసర: ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. కీసర రింగ్‌రోడ్డు వద్ద కుక్కలు అడ్డురావడంతో ముందు వెళ్తున్న వాహనం సడెన్ బ్రేక్‌తో ఆగిపోయింది. దీని వెనకాలే వస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి వాహనం ఢీకొనడంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. తాను సురక్షితంగా ఉన్నానని కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి తెలిపారు.

శాస్త్రీయ కళలకు నూతనత్వం తోడవ్వాలి

ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శాస్త్రీయ కళలను కాపాడుతూ వాటి వైభవాన్ని ముందు తరాలకు కొత్తదనంతో అందించే ప్రయత్నం చేస్తున్నామని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన శాస్త్రీయ నృత్య గురువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో శాస్త్రీయ నృత్య సంగీతాన్ని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విశ్వవిద్యాలయాల్లో కూడా పరిచయం చేసే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కళాభిమానుల సహకారంతో నిత్య ప్రక్రియలో నూతనత్వాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. శ్రీశ్రీ,, గుర్రం జాషువా, గురజాడ దేశభక్తి, అభ్యుదయ గేయాలకు శాస్త్రీయ నృత్యాలను జోడించి కళలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, ఎస్ఆర్‌ఐ సుశీల, ప్రొఫెసర్ రత్న, సంధ్య, పుష్ప, శరత్, మాస్టర్ రేపల్లె కృష్ణ, వాల్మీకి, పిఎస్ మూర్తి, రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


క్రికెటర్ త్రిషకు సత్కారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని రాష్ట్ర క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ విజేత భారత జట్టు సభ్యురాలైన గొంగడి త్రిషను బుధవారం బీఆర్‌కే భవన్‌లోని తన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా త్రిషకు నగదు ప్రోత్సాహం కోసం ఆమె తండ్రి రామిరెడ్డి క్రీడా శాఖ కార్యదర్శికి విజ్ఞాపన పత్రం అందజేయగా ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిశీలిస్తామని ఆయన తెలిపారు.

నిమ్స్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించండి

లక్డీకాపూల్: నిమ్స్ వైద్యుల మానసిక, శారీరక ఉల్లాసానికి ఆస్పత్రిలో మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్‌కు నిమ్స్ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. బుధవారం ఆయన చాంబర్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జిషాన్, కార్యదర్శులు శరత్, శ్రీనివాస్ కలిసి వినతిపత్రం సమర్పించారు. జూనియర్ డాక్టర్లు ఎంతో పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, మానసిక విశ్రాంతికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ విషయమై స్పందించిన ఆంజనేయ గౌడ్.. నిమ్స్‌లో స్థలాన్ని పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు.

ఓవర్ లోడ్



మూడు వేల మెగావాట్లు దాటిన విద్యుత్ డిమాండ్

- తీవ్ర ఒత్తిడికి గురవున్న ఫీడర్లు.. డీటీఆర్‌లు
- ఎర్తింగ్ లోపం.. తరచూ ఫ్లెక్సివేషన్లు
- సరఫరాలో అంతరాయాలు
- ఫిర్యాదులకు స్పందించని ఇంజనీర్లు
- ఆందోళనలో వినియోగదారులు

గ్రేటర్‌లో ఇటీవల విద్యుత్ వినియోగం ఇలా..

తేదీ	మిలియన్ యూనిట్లు	పీక్ డిమాండ్ (మెగావాట్లలో)
20	56.8	2820
21	57.9	2879
22	58.8	3335
23	59.9	2879
24	60.0	2932
25	56.8	2736
26	52.9	2479
27	57.8	2810
28	58.9	2873

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎండలు భగ్గున మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో సిటిజన్లు ఉపశమనం కోసం రోజంతా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆన్ చేసి ఉంచుతున్నారు. పగటిపూట మాత్రమే కాదు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యుత్ వినియోగం అనుహ్యంగా పెరుగుతోంది. ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో సబ్‌స్టేషన్లలోని ఫీడర్లతో పాటు వీధుల్లోని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఆయిల్ లీకేజీలను అరికట్టకపోవడానికి తోడు డీటీఆర్‌ల వద్ద సరైన ఎర్తింగ్ సిస్టం లేకపోవడం వల్ల షార్ట్‌సర్క్యూట్‌లు, సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యలు తలెత్తుతున్నాయి. అసలే వార్షిక పరీక్షల కాలం.. ఆపై ఇంట్లో కరెంట్ కూడా లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొంతకాలంగా 24 గంటల కరెంట్ సరఫరా పుణ్యమా అని చాలా మంది తమ అపార్ట్‌మెంట్లలోని జనరేటర్ల వాడకాన్ని మరిచిపోయారు. ఏళ్ల తరబడి నిర్వహణ లేమికి తోడు ట్యాంకులో డీజిల్ కూడా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్లు చేస్తే.. క్షేత్రస్థాయి లైన్‌మెన్లు, ఏఈలు, ఏడీఈలు, డీఈల నుంచి ఆశించిన స్పందన రావడం లేదు.

ఆయిల్ లీకేజీలు...ఎర్తింగ్ సమస్యలు..

ఎండలకు ఇన్సులేటర్ల మధ్య పగుళ్లు ఏర్పడుతున్నాయి. వీటి మధ్యలో గ్యాప్ ఏర్పడుతుండటం.. తెల్లవారుజామున కురిసే మంచు వీటి మధ్య చేరడంతో షార్ట్‌సర్క్యూట్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా ఆయా ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాలకు సరఫరాలో అంతరాయం తప్పడం లేదు. అంతేకాదు నగరంలోని మెజార్టీ సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు రాక్ ఏరియాల్లోనే ఏర్పాటు చేశారు. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యలు తలెత్తినప్పుడు ఎర్తింగ్ కీలకంగా వ్యవహరిస్తుంది. మెజార్టీ డీటీఆర్‌ల వద్ద సరైన ఎర్తింగ్ సిస్టం లేదు. ఉన్న చోట నిర్వహణ అధ్వానంగా తయారైంది. డీటీఆర్‌ల చుట్టూ చెత్త పేరుకుపోతోంది. ఫ్యూజులు పోయిన సమయంలోనే కాదు.. షార్ట్‌సర్క్యూట్ వంటి సాంకేతిక సమస్యలు తలెత్తిన సమయంలో నిప్పు మిణుగురులు ఆ పక్కనే ఉన్న చెత్తపై పడటంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి డీటీఆర్‌లో పేలుళ్లతో పాటు సంస్థకు ఆస్తి నష్టం వాటిల్లుతోంది. నిజానికి ప్రతి మూడు నెలలకోసారి లైన్ల పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఆశించిన విధంగా పనులు చేయడం లేదనే విమర్శలు లేకపోలేదు.

అంచనాలు మించే అవకాశం..

- గ్రేటర్‌లో 2019 మే 29న రికార్డు స్థాయిలో 73.4 ఎంయూల కరెంట్ వినియోగం జరిగింది. కోవిడ్ కారణంగా వరుసగా రెండేళ్ల పాటు వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు మూతపడ్డాయి. నిర్మాణాలు, గృహ ప్రవేశాలు కూడా పెద్దగా లేకపోవడంతో కరెంట్ వినియోగం అనూహ్యంగా తగ్గింది. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత 2022 ఏప్రిల్ 18న 69.4 ఎంయూలు నమోదైంది. అప్పట్లో గరిష్ట డిమాండ్ 3435 మెగావాట్లుగా ఉంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది కొత్త కనెక్షన్లు 12 శాతం పెరిగాయి.
- పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయి. ప్రతి ఇంట్లోనూ ఏసీ, కూలర్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, గీజర్, వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు సర్వ సాధారణమయ్యాయి. ఫలితంగా విద్యుత్ వినియోగం కూడా రెట్టింపైంది. భగ్గున మండుతున్న ఎండలకు తోడు రాత్రిపూట చలి తగ్గి.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం నగరవాసులు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు 24 గంటలు ఆన్‌లో ఉంచుతుండటంతో కరెంట్ వినియోగం రెట్టింపవుతోంది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే.. ఈ వేసవిలో 4 వేల మెగావాట్లకు చేరి రోజు సగటు వినియోగం 80 ఎంయూలు దాటే అవకాశం ఉన్నట్లు డిస్కం ఇంజినీర్లు అంచనా వేశారు.



‘సీపీఆర్’.. ఆపద పరార్!

సడెన్ కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)తో ఎలా రక్షించవచ్చో ప్రాక్టికల్‌గా వివరిస్తున్న చిత్రాలు ఇవి. బుధవారం తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని జీవీకే- ఈఎంఆర్‌ఐ సెంటర్‌లో సీపీఆర్ శిక్షణ ప్రారంభోత్సవం సందర్భంగా వైద్యులు సీపీఆర్ విధానాన్ని చూపిస్తుండగా మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, మల్లారెడ్డి తదితరులు ఇలా ఆసక్తిగా తిలకించారు.



ఫార్మా పరిశ్రమలో పేలిన రియాక్టర్

- ఇద్దరు కార్మికుల మృతి

జీడిమెట్ల: ఫార్మా పరిశ్రమలో రియాక్టర్‌ను శుభ్రపరుస్తుండగా మంటలు అంటుకుని రసాయనాలు మీదపడటంతో ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. జీడిమెట్ల సీఐ పవన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శ్రీనివాస్ రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కుమార్ సరెన్ (25), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నరేంద్ర (26) సూరారంలో ఉంటూ జీడిమెట్ల ఫేజ్-4లోని అరోర్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు డ్యూటీకి వెళ్లారు. ఉదయం 10.15 గంటలకు పరిశ్రమలోని రియాక్టర్‌ను రసాయనాలతో శుభ్రపరుస్తున్నారు. ఒక్కసారిగా మంటలు అంటుకుని కుమార్, నరేంద్ర రసాయనాలు పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

డిస్కం.. అలర్ట్

సాక్షి ఎఫెక్ట్..

- ‘సాక్షి’ కథనంపై స్పందించిన సీజీఎం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల జారీ, ప్యానల్ బోర్డుల మంజూరులో జరుగుతున్న జాప్యంపై ‘సాక్షి’ జిల్లా ఎడిషన్‌లో ‘డిస్కంలో వసూళ్ల దందా’ శీర్షికన ప్రచురితమైన కథనంపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో తీవ్ర దుమారమే చెలరేగింది. ఏ సర్కిల్ పరిధిలో ఎన్ని ప్యానల్ బోర్డులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని డీటీఆర్‌లు మంజూరు చేశారు? కొత్తగా ఎన్ని మీటర్లు జారీ చేశారు? లైన్ షిఫ్టింగ్ వర్కులు ఎన్ని పూర్తిచేశారు? వాటి ఎస్టిమేషన్లు? ఇప్పటి వరకు ఎన్ని మీటర్లు మార్చారు..? వంటి అంశాలపై సెక్షన్ల వారీగా రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్ సమగ్ర నివేదిక కోరారు. అదే విధంగా ఇబ్రహీంపట్నంలో సిబ్బంది చేతివాటంపై విచారణకు ఆదేశించారు. విద్యుత్ శాఖలో అవినీతికి పాల్పడే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.2,843 డీడీ కట్టారు: ఏడీఈ

ఇదిలా ఉండగా ఈ అంశంపై ఇబ్రహీంపట్నం ఏడీఈ సైదులు ‘సాక్షి’కి వివరణ ఇచ్చారు. మీటర్ జారీ విషయంలో లైన్‌మన్ డబ్బులు డిమాండ్ చేసిన విషయంలో వాస్తవం లేదన్నారు. అడగకపోయినా.. సదరు వినియోగదారుడే స్వయంగా తమ జూనియర్ లైన్‌మెన్‌కురూ.4 వేలు ఇచ్చారని, ఇందులో రూ.2843 కొత్త మీటర్ కోసం డీడీ కట్టినట్లు చెప్పడం గమనార్హం.



జేసీబీలో వెళ్తున్న విద్యార్థులు

బండి ఏదైనా బడికెళ్లడమే!

కేశంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సరైన రవాణా సదుపాయాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కేశంపేట మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన విద్యార్థులు నిత్యం రెండు కిలోమీటర్ల దూరంలోని కొత్తపేట ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారు. వీరికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఏ వాహనం దొరికినా లిఫ్ట్ అడుగుతారు. ఈ క్రమంలో మంగళవారం జేసీబీ తొట్టిలో నిలబడి స్కూల్‌కు వెళ్లిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉండగా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు ఆందోళన చేసినా ఫలితం లేకుండాపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆట కదరా శివా..

- పెళ్లింట తీరని విషాదం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్మీ జవాన్ మృతి
- చెల్లి పెళ్లి చూడకుండానే తుదిశ్వాస

షాద్‌నగర్: వివాహ ఆహ్వాన పత్రికలు పంచే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్మీ జవాన్ శ్రీనివాస్ మృతిచెందారు. చెల్లెలి పెళ్లి జరిగిన రోజునే అన్న కన్నుమూయడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లికి చెందిన ఇప్పటూర్ సత్యమ్మ, సత్తయ్య దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కొడుకు శ్రీనివాస్ (30) ఆర్మీ జవాన్‌గా జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్య ప్రియాకంతో కలిసి తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నాడు. చెల్లి వివాహం నిమిత్తం ఇటీవల భార్యతో పాటు స్వగ్రామానికి వచ్చాడు. బంధువులకు ఆహ్వాన పత్రికలు పంచే క్రమంలో పది రోజుల క్రితం మండల పరిధిలోని కమ్మదనం వద్ద బైక్ అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా బుధవారం మృతిచెందాడు.



శ్రీనివాస్ మృతదేహానికి గౌరవ వందనం

ఓ వైపు వేడుక.. మరో వైపు విషాదం

శ్రీనివాస్ చెల్లెలు శిరీషకు వికారాబాద్ జిల్లా ధారూరు మండలం రాజాపూర్‌కు చెందిన గోవర్ధన్‌తో బుధవారం వివాహం జరిగింది. వరుడి స్వగ్రామంలో నిరాడంబరంగా వివాహం జరిపించారు. పెళ్లి తర్వాత శ్రీనివాస్ మరణ వార్త విన్న కుటుంబ సభ్యులు, బంధువులు బరువెక్కిన హృదయాలతో కంసాన్‌పల్లికి చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. విషయం తెలుసుకుని గ్రామానికి చేరుకున్న ఆర్మీ ఆఫీసర్లు, సహచరులు గాలిలో కాల్పులు జరిపి, అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు.



శ్రీనివాస్ (ఫైల్)


గ్యాస్ భారం @ రూ.15 లక్షలు

- జిల్లాలో 9 లక్షల కనెక్షన్లు
- నిత్యం 30 వేల సిలిండర్ల రీఫిల్
- ఒక్కో డొమెస్టిక్ బండపై రూ.50 పెంపు
- జిల్లా వాసులపై నెలకు రూ.4.5 కోట్ల భారం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వంటింటిపై మళ్లీ గ్యాస్ గుది‘బండ’ పడింది. వరుస కోవిడ్ ఆంక్షల కారణంగా ఉపాధి కోల్పోయి, వ్యాపారాలు దెబ్బతిని.. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న జిల్లా వాసులకు తాజాగా కేంద్రం షాక్ ఇచ్చింది. ఒక్కో డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.50 పెంచి మరింత సంక్షోభంలోకి నెట్టింది. వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 చొప్పున పెంచింది. గృహ వినియోగదారులపైనే కాకుండా అటు హోటళ్లు, స్వయం ఉపాధి కోసం చిన్నచిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్న వారిపై కూడా భారం మోపడం గమనార్హం. ప్రస్తుతం జిల్లాలో 55 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో తొమ్మిది లక్షల కనెక్షన్లు ఉన్నట్లు అంచనా. రోజుకు సగటున 30 వేల సిలిండర్లు రీఫిల్ అవుతున్నాయి. ఒక్కో డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.50 పెంచి, జిల్లా వాసులపై రోజుకు సగటున రూ.15 లక్షల భారం మోపింది. ఈ లెక్కన నెలకు రూ.4.5 కోట్ల చొప్పున అదనపు భారం పడనుంది. వాణిజ్య సిలిండర్ ధరలు దీనికి అదనం. ఇప్పటికే నిత్యావసరాల ధరలు భారీగా పెరిగి ఆర్థికంగా చితికిపోయిన పేద, మధ్య తరగతి కుటుంబాలు తాజా ధరల పెంపుతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనున్నాయి.

మూడేళ్లలో 16సార్లు పెంపు

నిజానికి 2020 మేలో గ్యాస్ సిలిండర్ ధర రూ.589.50 ఉండేది. కేవలం ఈ మూడేళ్లలో 16సార్లు ధరలు పెంచింది. తాజాగా పెంపుతో సిలిండర్ ధర రూ.1,155కు చేరుకుంది. ఇదిలా ఉంటే గతంలో సిలిండర్‌పై సబ్సిడీ రూ.40.71 పైసలు ఇవ్వగా, ప్రస్తుతం సబ్సిడీని పూర్తిగా నిలిపివేసింది. అదనపు భారానికి తోడు రాయితీ కూడా ఇవ్వకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని నిరసిస్తూ అధికార బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.



కట్టెల పొయ్యి వెలిగించాలేమో..



సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణం. ఓ వైపు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుండగా, ఇలాంటి నిర్ణయం ఏమాత్రం సరికాదు. పేద ప్రజలు మళ్లీ కట్టెల పొయ్యిపై వంట చేసుకునే పరిస్థితి వచ్చింది.

– ఎనుగుల అనితయాదవ్, మాజీ ఎంపీటీసీ, జిల్లెలగూడ

సబ్సిడీ ఎత్తేయడం అన్యాయం



రోజురోజుకు పెరిగిపోతున్న గ్యాస్ ధరలు ఇబ్బంది పెడుతున్నాయి. మధ్య తరగతి ప్రజలకు గ్యాస్ వాడకం భారంగా మారుతోంది. నెలవారీ ఖర్చుల్లో గ్యాస్ ధరలే ఎక్కువవుతున్నాయి. కేంద్రం నిర్ణయం సరైంది కాదు. సబ్సిడీలను ఎత్తేయడం అన్యాయం.

– టి.లక్ష్మి, గృహిణి, చేవెళ్ల మండలం

మామిడి విక్రయాలు షురూ

- బాటసింగారంలో తాత్కాలిక మార్కెట్ ప్రారంభం
- ముఖ్యఅతిథిగా హాజరైన మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ లక్ష్మణుడు



బాటసింగారంలో మామిడి విక్రయాలను ప్రారంభిస్తున్న లక్ష్మణుడు తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం తాత్కాలిక పండ్ల మార్కెట్‌లో బుధవారం క్రయవిక్రయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.లక్ష్మణుడు ముఖ్యఅతిథిగా హాజరై బీట్లు ప్రారంభించారు. మార్కెట్ ఆవరణలోని 18 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన షెడ్లలో తొలిరోజు సరుకు విక్రయించేందుకు రైతులు తరలివచ్చారు. గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బాటసింగారంలోనే మామిడిని విక్రయించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మంచి ధర పొందాలని సూచించారు. అనంతరం మార్కెట్ ఆవరణలో కమీషన్‌దారులు, రైతులు, ఖరీదుదారుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ జనరల్ మేనేజర్ మన్మోహన్‌గుప్తా, డివిజనల్ జోనల్ మేనేజర్ రాజశేఖర్, గోవింద్, సుధాకర్, టీవీవీఎస్ శర్మ, యశ్వంత్ భోపేష్, లాజిస్టిక్ పార్క్ ఎండీ మహేశ్‌గుప్తా, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి, డీఈ రవీందర్‌లు పాల్గొన్నారు.

దాడులు చేయడం చట్ట వ్యతిరేకం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి


మీర్‌పేట: సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టి బొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: భౌతిక దాడులకు పాల్పడుతూ సభలను అడ్డుకోవడం చట్ట వ్యతిరేకమైన చర్య అని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. భూపాలపల్లిలో టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభపై బీఆర్ఎస్ నాయకులు రాళ్లు, గుడ్లు విసిరి సభను అడ్డుకోవడాన్ని ఖండిస్తూ బుధవారం మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలో సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ దౌర్జన్యాలు, అక్రమాలు, దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కేసీఆర్ పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్, నాయకులు యాదిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి అప్రజాస్వామికం: శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు దొంగ చాటుగా దాడులు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. దాడులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని.. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తల కష్టంతో చేతి గుర్తుపై గెలిచిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి అధికార దాహంతో, డబ్బుకు ఆశపడి బీఆర్ఎస్‌లో చేరి ఈ రోజు దాడులకు ప్రేరేపించడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజామద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్ పాండునాయక్, నాయకులు బీచ్యానాయక్, లక్ష్మయ్య, మల్లయ్య, మల్లేశ్‌గౌడ్, శ్రీను, రాజేశ్, భానుకిరణ్, మహేశ్, శ్రీశైలం, శ్రీకాంత్, జంగయ్య తదితరులున్నారు.

కిరాణ షాపులో చోరీ

మీర్‌పేట: కిరాణ షాపులో చోరీ జరిగిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన గజపతి స్థానికంగా బాలాజీ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి షాపు వెనుక భాగంలోని డోర్‌ను బద్దలు కొట్టి రూ. 30వేల విలువైన వస్తువులను ఎత్తుకెళ్లాడు. షాపు తెరిచేందుకు వచ్చిన యజమాని దొంగతనం జరిగినట్లు తెలుసుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయురాలి అదృశ్యం


మాధురి(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఓ ప్రైవేటు ఉపాధ్యాయురాలు అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన ప్రకారం.. తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలకు చెందిన లింగం జయమ్మరాజు దంపతుల కూతురు మాధురి తుక్కుగూడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. గత నెల 28న పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులను వాకబు చేశారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్స్ కాలనీలో ఓ వ్యక్తి..


లింగారెడ్డి(ఫైల్)

మీర్‌పేట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బాలాపూర్ మండలం గుర్రంగూడ గ్రామం, టీచర్స్ కాలనీకి చెందిన కాశీరెడ్డి లింగారెడ్డి(36) ఫిబ్రవరి 25న సాయంత్రం ఎవరికీ చెప్పకుండా తన బైక్‌పై ఇంటి నుండి బయలుదేరాడు. ఆయన మళ్లీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, ఇరుగు పొరుగు ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో భార్య ఉషారాణి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గోపాలుడి బ్రహ్మోత్సవం

- కనుల పండువగా స్వామి వారి కల్యాణం
- ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: కల్కిదోనగుట్ట గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11.30గంటల ప్రాంతంలో వేద పండితులు రుక్మిణి, సత్యభామ సమేత గోపాలస్వామి వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ఫౌండర్, ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, ఆలయ కార్యనిర్వాహక సభ్యులు కృష్ణమూర్తి, పాండురంగారెడ్డి, ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు కిష్టమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, స్వప్నారెడ్డి, వీరేశలింగం, జంగయ్య, ఏఎంసీ డైరెక్టర్ రమేశ్‌నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, నాయకులు శ్యాంసేట్, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పాండురెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, నేతలు

గోపాలస్వామి కల్యాణ వేడుకలకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి పలువురు నేతలు హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు.

డ్యూటీకని చెప్పి సొంతూరుకు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నవీన్ మృతదేహం

చేవెళ్ల: బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీర్జాగూడ బస్‌స్టేజీ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ హయ్యూమ్ కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం మొదీన గ్రామానికి చెందిన శానప్ప కుటుంబం బతుకు దెరువు కోసం హైదరాబాద్ ఫిలింనగర్‌లో నివాసం ఉంటోంది. శానప్ప కుమారుడు గొర్ల నవీన్(21) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కానీ పనికి వెళ్లకుండా స్వగ్రామం కర్నాటకకు బైక్‌పై వెళుతుండగా.. చేవెళ్ల మండలం మీర్జాగూడ బస్‌స్టేజీ వద్ద అర్ధరాత్రి రోడ్డుపై కిందపడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అతని తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యంకోసం నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

'అప్పల కుప్పగా తెలంగాణ'

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వీటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్.ప్రదీప్‌కుమార్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11వేల శక్తి కేంద్రాల కార్నర్ మీ టింగ్స్ పూర్తి చేసుకున్న సందర్భంగా అసెంబ్లీ శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్స్ ముగింపు సభ శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీలో ఏర్పాటు చేశారు. అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైతే నిధులు, నీళ్లు, నియామకాలు వస్తాయని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజలకు మొండి చేయి చూపించారన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కార్నర్ మీటింగ్స్ ఇన్‌చార్జ్ కొమురయ్య కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య బార్‌కు అనుమతివ్వొద్దు


ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ శ్వేతరవికాంత్‌రెడ్డి

మణికొండ: నివాసాల మధ్య బార్ ఏర్పాటుకు అనుమతించవద్దని కౌన్సిలర్ డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు లక్ష్మీనగర్ కాలనీలో కొత్తగా బార్ ఏర్పాటు చేస్తున్నారని, దానికి ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని కౌన్సిలర్ బి.శ్వేత రవికాంత్‌రెడ్డి కోరారు. బార్ ఏర్పాటు చేయాలనుకుంటున్న భవనానికి సమీపంలోనే పాఠశాల, హనుమాన్ దేవాలయం, మున్సిపల్ కార్యాలయం నిర్మాణంలో ఉందని, వీటిని దృష్టిలో ఉంచుకుని అనుమతులు ఇవ్వరాదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆలూరు వైద్య సిబ్బందిపై డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆగ్రహం


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు సరైన వైద్యసేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పనవి డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ అన్నారు. మండల పరిధిలోని ఆలూరు ఆస్పత్రిలో మంగళవారం వైద్యుల దుమ్మాపై గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్.. బుధవారం ఆలూరు ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మంగళవారం సాయంత్రం ఆస్పత్రిలో ఎవరూ విధుల్లో ఉండకపోవటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకొస్తే పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అప్పటి వరకు డ్యూటీలో ఉన్న వారు రిలీవర్ వచ్చే వరకు విధుల్లోనే ఉండాలనే విషయం తెలియదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కచ్చితంగా వెళ్లాల్సి వస్తే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కల్పించినందుకుగాను ఆలూరు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రఘుబాబుకు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులకు సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. సమావేశంలో సీహెచ్ఎస్ గోపాల్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ సుదర్శన్, ఆలూరు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తాం

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి


బహుమతులు అందజేస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పట్నం నరేందర్‌రెడ్డి

షాబాద్: పీఆర్ఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొల్లూరుగూడలో పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వారం రోజులుగా జిల్లా స్థాయి, క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బుధవారం వారు జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతితో కలిసి బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీల్లో నాగర్‌గూడకు చెందిన మన్సూర్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.లక్ష నగదు, మెమొంటో, షాబాద్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.75వేల నగదు, మెమొంటో అందజేశారు. వాలీబాల్ పోటీల్లో కంకల్ జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.25వేల నగదు, మెమొంటో, ద్వితీయ బహుమతిగా కక్కులూరు జట్టుకు రూ.15వేల నగదు, మెమొంటో అందజేశారు. క్యారమ్స్‌లో తౌసిఫ్, ఇమ్రాన్‌లకు నగదు బహుమతి, మెమొంటోలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. చేవెళ్ల ప్రాంత చైతన్యానికి సొంత ఖర్చులతో పోటీలు నిర్వహించి ప్రోత్సహించే వారిని గుర్తుచేశారు. షాబాద్ మండలాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే వెల్‌స్పన్, అమేజాన్ వంటి బడా కంపెనీలు రావడంతో షాబాద్‌కు ప్రపంచంలో గుర్తింపు వచ్చిందన్నారు. త్వరలో సీతారాంపూర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గానికి రూ.25కోట్ల నిధులు మంజూరు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. శంషాబాద్ నుంచి నాగర్‌గూడ వరకు రూ.200కోట్లతో నాలుగు లైన్ల రోడ్లకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా లీగల్ అడ్వైజర్ పీసరి సతీశ్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణారెడ్డి, శ్రీరాంరెడ్డి, ఇమ్రాన్, ముఖ్రంఖాన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం


నిందితుడు రాజు

శంషాబాద్ రూరల్: వివాహేతర సంబంధం ఓ మహిళ హత్యకు దారి తీసింది. తనతో గడిపితే డబ్బులు ఇస్తానని మోసం చేసిన వ్యక్తి ఆమె మెడకు చీర బిగించి హత్య చేశాడు. వారం కిందట మల్కారం సమీపంలో జరిగిన మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని రామంజాపూర్ గ్రామానికి చెందిన నార్ల పద్మమ్మ(45) భర్త గతంలో చనిపోయాడు. అదే గ్రామానికి చెందిన కత్తుల రాజు(35)తో ఉన్న పరిచయం వారిద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఆరు నెలల కిందట డబ్బులు ఇస్తానని ఆమెను లొంగదీసుకున్న ఇతను తర్వాత మాట మార్చడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి కొన్నాళ్లు మాట్లాడుకోలేదు. ఫిబ్రవరి 19న రాత్రి పద్మమ్మ అతడికి ఫోన్ చేసి డబ్బులు అడిగింది. బయటకు వస్తే ఇస్తానని చెప్పాడు. దీంతో రాత్రి ఏడున్నర గంటల సమయంలో పద్మమ్మను తన బైక్‌పై మల్కారం శివారుకు తీసుకెళ్లాడు. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పద్మమ్మను చీరతో మెడకు బిగించి హత్య చేశాడు. ఫిబ్రవరి 23న మల్కారం శివారులో పద్మమ్మ మృతదేహం లభించింది. మృతదేహం వద్ద దొరికిన సెల్‌ఫోన్, సమీపంలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనుమానంతో రాజును అదుపులోకి తీసుకుని విచారించగా పద్మమ్మను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న భూపాల్

మైలార్‌దేవ్‌పల్లి: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఎల్‌వో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలోని కాటేదాన్ చౌరస్తా నుంచి శంషాబాద్ ఏఎల్‌వో కార్యాలయం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్మికుల పక్షాన సీఐటీయూ ముందుండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదరి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, జిల్లా నాయకులు జి.కురుమయ్య, గట్టయ్య, ప్రవీణ్‌కుమార్, జె.పెంటయ్య, కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి పి.భాస్కర్, బాలస్వామి, రాహుల్, మహమూద్, సచిన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సైంటిస్ట్ ఆత్మహత్య కేసు

విచారణ ముమ్మరం

ఇబ్రహీంపట్నం రూరల్: డీఆర్‌డీఓలో పనిచేస్తున్న సైంటిస్టు ఆత్మహత్య కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్నేహితులు నమ్మించి నట్టేట ముంచారని మనోవేదనకు గురై వనం రమేశ్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఆదిబట్ల పోలీసులు కేసు విచారణప్రారంభించారు. నిందితులు వరప్రసాద్, రవికుమార్, సుందర్, రాజేశ్, అఫ్జల్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడిగా రూ.20 లక్షలు మాత్రమే ఒప్పందం చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల కోసం గాలిస్తున్నారు.

బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

8వ వార్డు కౌన్సిలర్ నవీన్‌కుమార్

మణికొండ: వ్యక్తిగతంగా దూషించడంతో పాటు అంతు చూస్తానని బెదిరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని అలకాపూర్ టౌన్‌షిప్ 8వ వార్డు కౌన్సిలర్ నవీన్‌కుమార్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు. బుధవారం మహాత్మాగాంధీ పార్కులో కామదేను సంస్థ తరఫున ప్రజలకు మిల్లెట్స్ టిఫిన్ అందించేందుకు వారు ఓ వాహనాన్ని తీసుకురాగా తాను అడ్డుకున్నానని, దీంతో తనను దుర్భాషలాడారని నవీన్‌కుమార్ చెప్పారు.